క్లుప్తంగా

సీఎం జగన్‌కు వినతి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను కలిసిన రాయుడు శ్రీనివాసరావు

తాటిచెట్లపాలెం: నగరానికి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రాయుడు శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. హెచ్‌బీ కాలనీలో నివసిస్తున్న శెట్టిబలిజ వర్గానికి చెందిన నిరుపేద కనకదుర్గ భర్త చనిపోవడంతో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోందని, ఆమె కుమారుడు కిడ్నీ వ్యాధితో చనిపోగా, 23 ఏళ్ల కుమార్తెకు కిడ్నీకి మార్పిడి జరిగిందని, ఈమెకు రూ.10 వేల ప్రభుత్వ పింఛన్ అందచేసి ఆదుకోవాలని సీఎంకు వినతిపత్రం అందజేశారు.

మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందిస్తున్న సత్యసాయి సేవకులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో సత్యసాయి సేవా సమితి(విశాఖ జిల్లా) ఆధ్వర్యంలో శుక్రవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో సీతమ్మధారలోని తహసీల్దార్ కార్యాలయం పక్కన, బాలయ్యశాస్త్రి లేఅవుట్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో సమితి ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాలు ఎంతో మంది దాహం తీరుస్తున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అలరించిన కర్ణాటక గాత్ర కచేరి



కీర్తనలు ఆలపిస్తున్న దేవీసుజాత

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన కర్ణాటక గాత్ర కచేరి భక్తులను అలరించింది. మండా సుధారాణి శిష్యురాలు తిరువీధుల దేవీసుజాత తన మృధు మధుర గానంతో అన్నమయ్య, త్యాగరాజ, దీక్షితార్ కీర్తనలు ఆలపించారు. అమ్మ ఆనంద దాయిని, ఏకదంతం, మామవసదా, పంచాషట్‌పేట, సాదు చరణ, నీలాంబరి, క్షీరాబ్ధికన్యకను కీర్తనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈమెకు హనుమంతు రామచరణ్ వయోలిన్‌పై, ఎం.కామేష్ మృదంగంపై వాద్య సహకారం అందించారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ గాయని సుజాతను అభినందించి సత్కరించారు.

దుమ్ము, ధూళితో అవస్థలు



ధూళిలో రాకపోకలు సాగిస్తున్న పాదచారులు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఒక భవనం పనులు జరుగుతున్నాయి. శుక్రవారం పొక్లెయిన్‌తో గోడలను కూల్చడంతో ఒక్కసారి దుమ్ము, ధూళి చెలరేగాయి. అటుగా వెళ్తున్న పాదచారుల కళ్లలోకి ధూళి చేరడంతో వారు ఇబ్బందులు పడ్డారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులు, వాహన చోదకులు అవస్థలకు గురయ్యారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు దృష్టి సారించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా పనులు జరిగేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మీ భద్రత.. మా బాధ్యత

- వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్న ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు
- విస్తృతంగా వాహన, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- నిబంధనలు మీరిన వారికి జరిమానాలు



దృశ్య, శ్రవణ వాహనం స్క్రీన్‌పై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పిస్తున్న సీఐ మళ్ల అప్పారావు(ఫైల్)

మద్రిపాలెం: వాహన చోదకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించేలా చూస్తూ.. కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించిన వారిపై కొరడా ఝులిపిస్తూ.. మళ్లీ అలా చేయకుండా వారికి సూచనలిస్తున్నారు. ఇటీవల కాలంలో ఎన్నడూ లేని విధంగా వాహన చోదకులకు రకరకాల పద్ధతుల అవగాహన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు చేపడుతున్నారు. ప్రధాన కూడళ్లలో రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తున్నారు. నెలకు కనీసం 20 సార్లు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక నిఘా..

మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఏకధాటిగా ప్రతి రోజు రాత్రి ప్రధాన రహదారులు, బీఆర్‌టీఎస్ రోడ్లల్లో గస్తీ నిర్వహించి వీరిని పట్టుకుంటారు. తాగి వాహనం నడపడం వల్ల అనేక మంది ప్రాణాలు గాల్లో కలిసిపోతున్న ఘటనల వల్ల ప్రతి రోజూ నిఘా పెంచుతూ గస్తీ కాస్తున్నారు. తనిఖీల్లో మందుబాబులు దొరికితే అవగాహన కల్పించి కేసులు నమోదు చేస్తున్నారు.

ఈ ఏడాది ఇప్పటి వరకు 390 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కట్టి వారిని కోర్టుకు అప్పజెప్పారు. వీరికి కోర్టు జరిమానాలు విధించింది. ఇందులో 352 మంది నుంచి రూ.5,67,400 జరిమానాలు వసూలు చేశారు. మిగతావారు ఇంకా కట్టాల్సి ఉంది.

అన్ని రకాల వాహనాలపై..

ఈ ఏడాది జనవరి నుంచి ఈ నెల 10 వరకు ఉన్న వ్యవధిలో 21,886 మందిపై అంటే ట్రాఫిక్ రూల్స్ పాటించని ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, లారీలు తదితర వాహనాలపై కేసులు నమోదు చేశారు. వారికి మొత్తం కలిపి చలానాల ద్వారా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు రూ.54,79,510 ఫైన్లు విధించారు. హెల్మెట్ ధరించకపోవడం, ట్రిపుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్, ఆటోలో ఓవర్ లోడ్, కార్లలో సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం తదితర కేసులు అధికంగా నమోదయ్యాయి. ఇందులో కొందరు స్పాటులోనే యాప్ ద్వారా జరిమానాలు చెల్లించారు. స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి మిగిలిన వారితో కట్టిస్తున్నారు.

- ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 21,886 మందిపై కేసులు.
- రూ.54,79,510 జరిమానాల వసూలు.
- 390 మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు.
- రూ.5,67,400 జరిమానాల వసూలు

రాంగ్ పార్కింగ్.. డేంజరస్ డ్రైవింగ్

రాంగ్ పార్కింగ్ చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టారు. కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఇరువైపులా ఉన్న రైతుబజారుకు వెళ్లి వచ్చే వారి సంఖ్య ఎక్కువ. అక్కడ ద్విచక్ర వాహనాలు పార్కింగ్ కోసం ఒక వరుస వరకు అనుమతిస్తున్నారు. వాహనదారులు ఇతరులకు ఇబ్బంది కలిగించేలా ఒకదాని వెనుక మరో వాహనం పార్క్‌చేస్తున్నారు. అలా నిబంధనలు ఉల్లంఘించిన 3,643 మందిపై జరిమానాలు విధించారు. డేంజరస్ డ్రైవింగ్ చేస్తూ రోడ్డు మీద న్యూసెన్స్ చేస్తున్న 351 మందికి జరిమానా మోత వడ్డించారు.

హెల్మెట్ ధరించని వారు..

ఈ ఏడాది ఇప్పటి వరకు హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన 13,480 మందికి ఫైన్లు విధించారు. గతేడాదిలో హెల్మెట్ లేకుండా ప్రయాణించి 147 మంది మృతి చెందారని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపి ప్రమాదాలకు దూరంగా ఉండాలని పోలీసులు వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నారు. మానవతా దృక్పథంతో కుటుంబాలను గుర్తు చేస్తూ.. దృశ్య, శ్రవణ వాహనాల ద్వారా గతంలో జరిగిన ప్రమాదాలను ప్రదర్శిస్తూ యువతకు సూచనలిస్తున్నారు. ఈ ఏడాదిలో ఫుట్‌పాత్‌లు, రోడ్లు, ఇతరత్రా ప్రదేశాలను ఆక్రమిస్తూ వ్యాపారాలు కొనసాగిస్తున్న 116 మందిపై కేసులు బనాయించారు.



చోదకుడికి హెల్మెట్ ధరించమని ప్లకార్డు చూపిస్తున్న ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు(ఫైల్)

ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు సూచనలు

ఆటో డ్రైవర్లు మోతాదుకు మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, డ్రైవర్ సీట్లో పక్కనే కూర్చోపెట్టుకోవడం, ఎక్కడపడితే అక్కడ ఆటోలు నిలిపివేయడం వంటి వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఫైన్లు వేస్తున్నారు. వివిధ రకాల అవగాహన కార్యక్రమాలు తరచూ నిర్వహిస్తూ కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు వాహన చోదకులకు కౌన్సెలింగ్ ఇస్తూ ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు బాధ్యతగా వ్యవహరించి నిబంధనలు ఉల్లంఘించకుండా నడుచుకుని పోలీసులకు సహాయపడి వారి జీవితాలను కాపాడుకోవాలని కోరుతున్నారు.



ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న కంచరపాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ పాపారావు(ఫైల్)

ఎన్టీఆర్ పురస్కారాల ప్రదానోత్సవం నేడు

సీతంపేట: విశ్వవిఖ్యాత నటుడు నందమూరి తారక రామారావు శత జయంతి సందర్భంగా ఎన్టీఆర్ కళారాధన పీఠం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పురస్కారాలు ప్రదానం చేస్తున్నట్లు పీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.ఎల్.ఎన్.స్వామి తెలిపారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. రంగస్థల నటులు టీకే వీరభద్రాచారి, పసుమర్తి సన్యాసిరావు, సాహితీవేత్తలు సాలిపల్లి మంగామణి, వృద్ధుల కల్యాణ రామారావు, పాత్రికేయులు ఆర్.శివకుమార్, గాయని పల్లా మనోరమ, సేవారంగంలో రాయపల్లి శ్రీనివాసరావు, ఎన్టీఆర్ అభిమాని బంటు అర్జునరావు, ప్రజా సేవా రంగంలో మోడేకుర్తి సత్యనారాయణ, కూచిపూడి నృత్య కళాకారిణి వాణి పద్మజలకు తెలుగు, సంస్కృత అకాడమీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి చేతులమీదుగా పురస్కారాలు అందిస్తామన్నారు. ఎన్టీఆర్ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

నేటి నుంచి దుర్గమాంబ ఉత్సవాలు



కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు తాటిచెట్లపాలెం కైలాసపురం పరిధి 16 గ్రామాల ఆరాధ్య దేవత దుర్గమాంబ అమ్మవారి జాతర ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఎర్రిపిల్లి అప్పారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న శనివారం తొలేళ్ల సంబరం, 14న ఆదివారం ప్రధాన జాతర జరుగుతాయని చెప్పారు. అమ్మవారిని, ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, జాతరలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. 19న భారీ అన్న సమారాధన నిర్వహించనున్నామన్నారు.

లలితా పీఠంలో చండీ హోమం

సీతంపేట: లలితా నగర్‌లోని లలితా పీఠంలో వైశాఖ మాసం బహుళ అష్టమి సందర్భంగా శనివారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్ఠాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి చేశారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. సాయంత్రం కాళీ కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సందడిగా ప్రపంచ నర్సుల దినోత్సవం



రేసపువానిపాలెం ఆరోగ్య కేంద్రంలో నర్సుకు స్వీట్ తినిపిస్తున్న డాక్టర్ మనశ్వి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైద్యురాలు మనశ్వి నర్సులకు స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సులు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



శివనగర్‌లో ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బిస్కెట్లు అందిస్తున్న స్టాఫ్ నర్సులు

శివనగర్ ఆరోగ్య కేంద్రంలో..

మద్రిపాలెం: జీవీఎంసీ 53వ వార్డు శివనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ నర్సుల దినోత్సవం వేడుకగా నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఏంజిలీనా ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. స్టాఫ్ నర్సులు ఆశ, సత్య, ఫార్మాసిస్ట్ మాధవి, ల్యాబ్ టెక్నీషియన్ మధు పాల్గొన్నారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్

సీతమ్మధార: బాల వికాష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీకృష్ణ మందిరం గురువాయూరప్పన్ ఆవరణలో ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై వర్క్‌షాప్ ప్రారంభించారు. ఐదు రోజుల పాటు వర్క్‌షాప్ కొనసాగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపక గౌరవ కార్యదర్శి నరవ ప్రకాష్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు ఉచితంగా శిక్షణ అందిస్తామన్నారు. 14 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయసు గల బాలికలు, మహిళలు అర్హులని డైరెక్టర్ యామిని తెలిపారు. మొదటి రోజు స్థానిక మహిళలు పాల్గొని పలు పెయింటింగ్స్ వేశారు.



పెయింటింగ్స్ వేస్తున్న మహిళలు

పెద్దలను గౌరవించండి

మురళీనగర్: పిల్లలు బాల్యం నుంచే పెద్దలను గౌరవించాలని, మంచి ప్రవర్తన కలిగి ఉండాలని వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు వి.ప్రభాశర్మ అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో శుక్రవారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని దిశ యాప్ వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇతరుల మాటలు గౌరవించడం, వారి భావాలను మంచిగా స్వీకరించడం నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, గురువుల మాట వినడం, వారి పట్ల గౌరవ భావాలను కలిగి ఉండటం వల్ల ఉన్నత స్థాయికి ఎదగగలరని చెప్పారు. బాలికలకు దిశ యాప్ రక్షణ కవచంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ వై.పద్మజ పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న ప్రభాశర్మ

ఇబ్బందికరంగా మండప స్టేజీల ఏర్పాటు

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలోని సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహిస్తున్న భవనం ఆవరణను పెళ్లిళ్లు, పుట్టిన రోజులు, ఇతర ఫంక్షన్లకు అద్దెకు ఇస్తుంటారు. గురువారం జరిగిన ఒక ఫంక్షన్‌లో కల్యాణ మండపంతోపాటు రోడ్డుపై ఇబ్బందికరంగా టెంట్లు వేయడంతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలకు గురయ్యారు. శుక్రవారం ఉదయం టెంట్లు, స్టీరియో బాక్స్‌లు, మండపంలో వేసిన స్టేజ్ తీయకపోవడంతో సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన వారు, హాస్పిటల్‌కు వచ్చిన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిర్వాహకులు స్టేజు ఏర్పాటు చేసి తీయకపోవడంతో లోపలకి వెళ్లడం కష్టతరంగా మారిందని చెబుతున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి ప్రజలు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఇబ్బందికరంగా ఏర్పాటు చేసిన స్టేజ్

ఉపాధి కార్యాలయ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ ఆవరణలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, విశాఖ డిస్ట్రిక్ట్ అసోసియేషన్ ఆఫ్ ది డెఫ్ సంస్థల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), కె.సుధ(టెక్నికల్) దీనిని ప్రారంభించి బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సంస్థ జిల్లా ఉపాధి కార్యాలయానికి వీల్ ఛైర్స్ అందించినట్లు సుబ్బిరెడ్డి తెలిపారు.

తల్లీకుమార్తె అదృశ్యం



రాణి



భువనేశ్వరి

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ తల్లీ, కుమార్తె అదృశ్యమైన ఘటన జరిగింది. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ దరి ఇందిరానగర్-3 ప్రాంతంలో ఉంటున్న రాణి అనే వివాహిత తన రెండేళ్ల కుమార్తె భువనేశ్వరితో కలిసి ఈ నెల 5న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. భర్త సరిగ్గా చూసుకోకపోవడంతో కొద్ది రోజులుగా ఇందిరానగర్‌లోని తన అన్న ఇంట్లో ఆమె నివాసముంటోంది. ఎంత వెతికినా కనిపించకపోవడంతో రాణి తండ్రి గొర్లి శ్రీనివాసరావు శుక్రవారం కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో ఏఎస్‌ఐ ఆదిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య

సీతమ్మధార: టెన్త్ పరీక్షలు రాసిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లో అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న నక్క సంతోష్‌కుమార్ దంపతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో బంధువుల ఇంటికి వెల్దామని తండ్రి ఫోన్‌లో చెప్పి కట్ చేసే సమయానికి కొడుకు అపురూప్ కుమార్(15) అపార్ట్‌మెంట్ పైనుంచి దూకడంతో తీవ్రగాయాలయ్యాయి. సీతమ్మధారలోని ప్రైవేట్ హాస్పిటల్‌లో చేర్పించగా.. చికిత్స పొందుతూ విద్యార్థి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రారంభం



సర్వాంగ వజ్రకవచధారుడిగా యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: సూర్యానగర్ జాతీయ రహదారిని ఆనుకుని వెలిసిన యోగ సిద్ధాంజనేయ స్వామి వారి ఆలయంలో శుక్రవారం హనుమజ్జయంతి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు పెనుమత్స సుబ్బరాజు దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాలను ప్రారంభించారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంత్ ఆధ్వర్యంలో శ్రీ పాంచరాత్ర ఆగమ సంప్రదాయంలో పూజలు నిర్వహించారు. మంగళధ్వని వేదమంత్రాలతో అర్చన, విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రుత్విక్వరుణ, మత్స్యంగ్రహణం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠ, హోమాలు, అష్టోత్తర శతకలశారాధన, ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. తొలి రోజున వజ్రకవచధారిగా యోగ సిద్ధాంజనేయ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు.

పథకాలతో పేదలకు ఆర్థిక స్వావలంబన

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 43వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సీతంపేట: పేద ప్రజలకు ఆర్థిక స్వావలంబన చేకూర్చడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 43వ వార్డు అక్కయ్యపాలెం-1 సచివాలయం పరిధిలోని 80 ఫీట్ రోడ్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాల లబ్ధిని వివరిస్తూ, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలపై ముద్రించిన కరపత్రాలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్తుంటే ప్రజలు వైఎస్ జగన్ పాలనపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇదే తమ ప్రభుత్వ పారదర్శ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి ఎం.ఇ.సునీల్, ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ మెంబర్ అంబటి శైలేష్, ఐసీఎస్ మండల కన్వీనర్ బులుసు జగదీష్, డైరెక్టర్ రాయుడు శ్రీను, 43వ వార్డు నాయకులు బైర వెంకట్, జక్కంపూడి సత్యనారాయణ, మహదాస్యం గోపి, ఖాదర్, ఎస్.కుమార్, సీనియర్ నాయకులు షేక్ బాబ్జి, కె.చిన్నా, గురువోజి, రాఘవులు, నేపాల్ శ్రీను, జగ్జీవన్, మల్లిక్, కనకరాజు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



శ్రీనివాసనగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

సీతంపేట: మదర్ ఇండియా వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ మాతృ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీలోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు ఉత్సాహంగా పాల్గొని కోలాటం, నృత్యాలు, కామెడీ స్కిట్లు, గీతాలాపనల ప్రదర్శనలతో అలరించాయి. రచయిత ఎస్.వరలక్ష్మి, అన్నమయ్య సేవా సంస్థ డైరెక్టర్ సునీత, లలిత సౌందర్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ట్రస్టు వ్యవస్థాపకులు మళ్ల వెంకటరావు, లక్ష్మి దంపతులు, ఎం.వి.కిశోర్‌కుమార్, ఎం.రేణుక దంపతులు, కర్రి ఇందిరా ప్రియదర్శిని, సత్యమాధవి, కనిశెట్టి అప్పారావు చేతుల మీదుగా పేద మహిళలకు, పారిశుధ్య సిబ్బందికి చీరలు, పండ్లు పంపిణీ చేశారు. ట్రస్టు సాంస్కృతిక విభాగం మానేపల్లి లక్ష్మి బృందం, పంతుల లలిత ఆధ్వర్యంలో ప్రదర్శించిన నాటిక, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు గౌరవాధ్యక్షులు బండే వెంకటేశ్వరరావు, సత్యమాధవి, ట్రస్టు సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



అతిథులను సత్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

అమ్మవార్లకు విశేష పూజలు

కంచరపాలెం: గొల్లకంచరపాలెం ధనలక్ష్మి దేవి ఆలయంలో, దుర్గానగర్ దుర్గమాంబ అమ్మవారి ఆలయంలో వైశాఖ శుక్రవారం పూజలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామా సేవా సమాజం (యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయాల ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్య శర్మ, శ్యామ్ అమ్మవార్లకు విశేష కుంకుమ పూజలు, పూల, పంచామృతాభిషేకాలు చేశారు. భక్తులు పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వారికి తీర్థప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ సభ్యులు సానబోయిన సంపత్‌కుమార్, పల్లా పెంటారావు, వెంకటరావు తదితరులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.



ధనలక్ష్మి దేవికి హారతి సమర్పిస్తున్న అర్చకుడు



పూజలందుకున్న దుర్గమాంబ